# మూగవోయిన మనసు

అయిదుగురు 'మగ' పిల్లల తరువాత పుట్టిన సరస్వతిని, అల్లారు ముద్దుగా పెంచటంలో ఆశ్చర్యం ఏమీ లేదు. మన సంసారాల్లో వున్న విశేషమే ఇది. ప్రతి సంసారానికి ఏదోరకం ప్రత్యేకత లేకపోయినట్లయితే ఈ పాటికి మన సంసారాలు దివాలా అయివుండేవి తప్పకుండా. ఇతరుల్లో లేని ప్రత్యేకత ప్రతి మనిషిలోనూ వుండటం కూడా అతి సహజంగా మనం ఒప్పుకోదగినదే. అసలు 'శాస్త్రి' దంపతుల్లోనే గాకుండా, మనస్తత్వాన్ని పురస్కరించుకుని మనసు గురించి ఒకమాట చెప్పటానికి వీలుంది. ప్రపంచంలో భోగాలు ఒక రకం గాదు. ఈ అనేక రకాలు ఒకేమనిషిలో కనిపించవు. ఒకడు, తనకు అనుభవంలో లేని భోగాలను పొందాలని, మహా తాపత్రయ పడతాడు. నిజానికి వాడు అనుభవిస్తున్న సుఖం, కోరుతున్న దానికన్నా ఎన్నో రెట్లు గొప్పదై ఉండవచ్చును కూడా. ఆ భోగాలను పొందుతున్న మనుషుల యెడ ఈర్ష్య తెచ్చుకుంటాడు. దేనికో వాళ్ళని సాధించటానికి తయారవుతాడు.

అట్లాగే పిల్లలున్నవాళ్ళు, వాళ్ళ అల్లరి ఎక్కువగా వుందనీ, లేనివాళ్ళు తమకిక పుట్టగతుల్లేవనీ, మగపిల్లల్లేని వాళ్ళు తమకు పున్నామ నరకం తప్పదనీ, ఆడపిల్లల్లేని వాళ్ళు కన్యాదాన ఫలం దక్కదనీ బాధపడుతూంటారు. ఈ బాధలనుంచి విముక్తులవటానికే 'దత్తు' అనేది గూడాను? శాస్త్రి దంపతులకు వరుసగా అయిదుగురు మగపిల్లలు కలిగారు. ఈ అయిదుగురు పుడుతూన్నంత కాలం ఆడపిల్లల కోసం వాళ్ళు పడ్డపాట్లు వర్ణించటానికి హితవుగాదు. రాయున్న చోటల్లా మొక్కటంతో పూరుకోలేదు, శాస్త్రీయంగా సలహాలనుకూడా పొందారు. 'అందరికీ వస్తుందా పెట్టి పుట్టాలిగాని? పూర్వజన్మలో ఏ ఆడపిల్ల గొంతు కోశామో' అనేది శాస్త్రిగారి భార్య

ఈశ్వరమ్మ. దైవమిచ్చిందాన్తో తృప్తిపడాలన్నమాట ఆవిడకు అప్పుడప్పుడు శాస్త్రిగారు గుర్తు చేస్తూండబట్టి గాని, లేని పక్షంలో కనీసం మూడో కాన్పుతోనైనా, ఆవిడకు, పిచ్చెత్తి పోయుండేదనటంలో సందియంలేదు. ఆఖరుకు, అయిదో పిల్లడి కాన్పుతో ఆవిడకు ఆ స్థితి కలిగేదై పోయింది. పురిట్లో మాతా, శిశువుల్ను చూట్టానికి వచ్చిన వాళ్ళంతా తనను ఈసడించుతున్నట్లు కనిపించేది.

"మాణిక్యంలాంటి మగపిల్లల్ని కన్న మహాలక్ష్మి" అన్న బిరుదుతో ఆవిడ సంతుష్టిపడి ఊరుకోలేదు.

చివరకు నోములు ఫలించినై. 'ఆడపిల్ల' అన్నముక్క మంత్రసాని చెవిని వేసేసరికి శాస్త్రిగారు ముఖం 'అంత' చేసుకున్నాడు. ఆ ఆనందాన్ని భరించలేక ఆయన బజార్లవెంట పరుగులు గూడా తీశాడు. దారినకనిపించిన యెరిగినవాడి చెవినల్లా ఈ వర్తమానం పడేస్తూ ఆయన స్థితి పూర్తిగా తెల్సినవాళ్ళు... అనగా లోతుపాతులు... ఏమీ ఆశ్చర్యపడలేదు గాని, తెలీనివాళ్ళు సానుభూతి చూపారు.

కనీసం డబ్బున్నవాళ్ళు పడే కష్టాలైన అనుభవించాల్సిన అవసరం లేకపోయిందాయనకు! శాస్త్రిగారి ఈ నోముల పంట అనుకునేదానికి విచారపడ్డ వాళ్ళు గూడా వున్నారు. వాళ్ళు.... 'అయిదుగురు మగపిల్లలూ కట్నం రూపంగా తెచ్చిందాన్ని ఈ వొక్క అమ్మాయీ అత్తింటికి జేరవేస్తుంది...' అన్నారు. దాన్లోనే అనందించదగ్గ సంగతి కనిపించింది ఆ దంపతులకు.

ఆడపిల్లలకు జరపాల్సిన లాంఛనాలన్నీ సక్రమంగా గడిచిపోతున్నై. సరస్వతి అడుగడుక్కూ పెద్దదై, విజ్ఞాన వికాసాలను సంపాయిస్తూ, రూపలావణ్యాల్తో కళ్ళు చెదరగొట్టేదై నట్టింట వైభవోపేతంగా వున్నందుకు ఈశ్వరమ్మకంటె శాస్త్రి ఎక్కువగా మురిశాడు. మరి నిజంగా చెప్పాలంటే ఈశ్వరమ్మది పైకి కనిపించని మమకారం కావచ్చును. ఇట్లాంటి మమకారాలు ఆపత్సమయాల్లో గాని కడుపు చించుకొని ఇవతల పడవు.

గర్భాష్టకంలోనే, తెలివైనవాడూ పేరు ప్రఖ్యాతులు కలవాడూ అయిన వాడిచేత జాతకం చూపించి, సరస్వతికి వివాహం చేశారు. ఇది కొందరికి అయిష్టంగానే ఉంది. శాస్త్రిగారి ఆత్మీయుల్లో చాలామంది సంస్కరణాధురంధరులూ, కార్యశూరులూను. ఇంత చిన్న వయసులో వాళ్ళు పెళ్లికి అంగీకరించకపోయినా, శాస్త్రిగారి కదొక ఆలోచించాలిసిన విషయంగా కనిపించలేదు. పెళ్లి జరిగింది. తగాదాలేవీ

కాలేదు. పెద్ద పెద్ద ఇళ్ళల్లో పోట్లాటలకు తావు ఉండదనటానికి పూర్తిగా వీలులేదు. అయినా డబ్బుకు లక్ష్యంలేకుండా పెద్దమనిషి తరహాగా వున్నంతకాలం ఈ ప్రశ్న ఉదయించదు. సాధారణంగా మనం వెరవాల్సిన బాల్యవివాహం కారణంగా ఉపద్రవం ఏమీ జరగలేదు. సరస్వతి 75 సంవత్సరాల వరకూ మంగళసూత్రంతోనే ఉండి తనువు చాలించింది. అదంతా రెండో పక్షంలో సంగతి.

సరస్వతిలాంటి ప్రాణులు ప్రపంచములో కోటికో-దైవం కటాక్షిస్తే లక్షకో ఒకటి! సర్వసుఖాలూ పాదాల అట్టడుగున ఉండిపోయినై. కామన లేకుండానే అన్నీ అనుభూతం అయినై. శ్రేష్ఠమైన భర్త దొరికాడు. అతడూ సరస్వతికి భర్త అనదగ్గవాడే గాని, సామాన్యంగాదు. పెళ్లి ప్రస్తావన వచ్చిందగ్గర్నుంచీ శాస్త్రి గారు "సరస్వతి మాకు లేక లేక కలిగింది. అయిదుగురు మగవాళ్ళ వెనుకన దాని అయిదుగురు ఆడ పిల్లల తరువాత కలిగిన మగపిల్లాడిగ్గాని ఇవ్వను. అప్పుడు సరైన జంట అవుతుంది" అన్నాడు. తథాస్తు? శాస్త్రి నియమం ప్రకారం వరనిర్ణయానికి శ్రమదమాలే కలిగినై. అయినా అవి ఫలించి, కోరుతున్న కుర్రవాడు అల్లుడైనాడు. ఆతడికి అయిదుగురు అక్కలు-అతని తరువాత సంతతతి లేదు. శాస్త్రి గారు మనసులోని కోర్కె మొక్కవోకుండా తీరినందుకు ఇతోధికంగా సంతసించారు. అదృష్టం ఒకళ్ళు కోరుకుంటే వచ్చేది కాదు. దానంతటది రావాలి. దానికోసం ఉపవాసాలుండీ, కొబ్బరి కాయలు కొట్టీ లాభంలేదు.

పదిహేనోయేట శాస్త్రోక్తంగా గర్భాధానక్రియ జరిపి, సరస్వతిని అత్తవారింటికి పంపారు. కాపురం ప్రారంభమయింది! సరస్వతికి మామగారు లేరు. అత్తగారు కోడలు కాపురానికి వచ్చిన సంవత్సరమే చనిపోయింది గుండెజబ్బువల్ల. సరస్వతి భర్త అయిన ముకుందరావు బహునెమ్మదస్తుడు. అతడి అక్కయ్యలూ గొప్ప గొప్ప ఇళ్ళల్లోనే ఉన్నారు. అయినా వాళ్ళకు పుట్టింటిమీద మమకారం పూర్తిగా తొలిగిపోలేదు.

సరస్వతికి అత్తవారిల్లు ఏమీ భేదంగా కనిపించలేదు మొదట. పుట్టింటవున్న అన్ని ఏర్పాట్లూ ఇక్కడా వున్నై. 'స్వజనం'కోసం అందరాడపిల్లలూ పడే తపనే కొన్ని నాళ్లవరకూ సరస్వతీ అనుభవించింది. తరువాతంతా మామూలయిపోయింది. శాస్త్రి దంపతులకూ విశేషం యేమీ అనిపించక పోవటమే మనం ఆశ్చర్యంగా చెప్పుకోవాల్సింది. అయితే గుండె నిబ్బరం వాళ్ళ వంశపారంపర్యపు హక్కు. ముకుందరావు వ్యవహార జ్ఞానకుశలుడు, ఇల్లు చక్కదిద్దుకోవటం బాగా తెలుసును. అయిదుగుర్లోనూ యెవరో ఒకరు యెప్పుడూ అతని ఇంటనే వుండేవారు, పురుళ్ళూ

పుణ్యాలూ నేపోస. వీళ్ళంతా వచ్చి తన ఇంటవుండి, తనచేత చాకిరి చేయించు కుంటున్నందుకు ముకుందరావు ఏమీ అనుకోడు. కాని వాళ్ళ సాధింపులకూ, ఎత్తిపొడుపు మాటలకూ అతడి వెన్నెముక విరిగిపోతోంది. ఒకర్నో ఎత్తుగానూ, మరొకర్ని ఇంకొక ఎత్తుగానూ చూట్టానికి లేదు. వీరికి కొన్నంత ఖరీదు బట్టలే తక్కిన వారికీ కొనాలి? ప్రతి తడవా ఒకేరకమైన గుడ్డల్దొరకవు గదా! విలువగల గుడ్డ ఒకరికిచ్చి, మిగతా వారికి కొద్దిగా తక్కువరకం ఇవ్వటానికి లేదు. ఒక కుఱ్ఱాడి అన్న ప్రాశనకు వెండిగిన్నె యిస్తే, ఇహ ఆ యింట్లో ఊయల గట్టిన ప్రతి కుఱ్ఱాడికీ ఇవ్వాలి. ఈ నిక్కులు (?) సరస్వతిగానీ, ముకుందరావుగానీ ముందుగా ఊహించలేదు. అవ్వి సాక్షాత్కరించిన తరువాత వెనుదీయకుండా, సాహసం చేసి లోటుపాట్లు రాకుండా చూస్తూనే వున్నారు. అయినా కొన్ని ఇలాంటివి తప్పలేదు.

ఆ రోజు అందరికీ బద్ధకంగా వున్నది. క్రితం రాత్రి రెండో సినిమాకు వెళ్ళి వచ్చారంతా. తరువాత కబుర్లు చెప్పుకుంటూ తెల్లవారుజాము వరకూ మేల్కొనే వున్నారు. అందరికన్నా ముందుగా లేచి సరస్వతి ఇంటిపనుల్లో జొరబడింది. అందరూ లేచి ముఖాలు కడుక్కుని తయారయ్యే సరికి తొమ్మిదయింది. ముకుందరావు లాలనగా 'ఏం తొందరగా లేచావు?' నిద్రమత్తుతో 'పన్లేమంత ముంచుకు పోయాయని?' అన్నాడు. సరస్వతి ఆకులువేసి, ఫలహారాలు ఉంచింది అందరిముందూ. పెద్ద ఆడబిడ్డా, నాలుగో ఆమే అప్పుడక్కడ వున్నారు. ఒకామె 'మా మరదలు చాలా శ్రమపడ్డదే! ఏం మునిగి పోయిందనమ్మా ఇంత శ్రమ పడకపోతే పొద్దునే. ఒక్క రోజులో ఏం పోయిందీ?' అన్నది. సరస్వతి చప్పున 'అదేంమాట వదినా?' అన్నది. అంతా మురిశారు.

కొంతసేపటికి దొడ్లోనించి - 'చూశావుటే, అక్కయ్యా?' అన్న అరుపు వినిపించింది. పెద్దామె అక్కడికి వెళ్ళింది. నాల్గో ఆమె అక్కగార్తో తమ్ముడిపై ఫిర్యాదు చేసింది "చూశావుటే, వీడినీ, వీడి పెళ్ళాన్నీ కూచోబెట్టి, చేసిపెట్టాలట ఇక్కడికి వచ్చింది ఎందుకూ మనం?" ముకుందరావు ఆవిడ నోరు కట్టెయ్యటానికి తను మాట్లాట్టం తప్ప మరో ఉపాయం ఉన్నట్లు తోచలేదు. "కాదే అక్కయ్యా! మీ మరదలు అలిసి పోయిందని మీరేగదా అన్నది ఇందాక, పోనీ దానికి సాయంగా దీన్ని వంట చెయ్యమన్నాను. ఇష్టమైతే సరి. లేకపోతే వీల్లేదని చెప్పు! పెద్దగా అరిస్తే మళ్ళీ అది విన్నా ఈ మాటన్నందుకు నన్ను..." తరువాత తన పెద్ద అక్కగారు తాల్చిన ఆకారానికి ముకుందరావు నిలువునా విస్తుపోయినాడు. "కాని మనుషులు" అనుకున్నాడు

మనసులో. అతనికి సాధారణ స్త్రీత్వంలోనే అపనమ్మకం కలిగింది. తమ ఇళ్ళల్లో వుంటూ ఎవరిపని వారు చేసుకోక తప్పుతుందా? కాక, పుట్టింటికి వచ్చినపుడు వాళ్ళ కాళ్ళు చేతులు మొండిపడిపోత్తై గావును! ఎవరూ యెరగని స్థితిలో, తమంత వారు లేరని గర్వించే దశలో వుంటారు వాళ్ళు.

భోజనాలయిన తరువాత అందరూ నిద్రలకుపడ్డారు. కాని సరస్వతికి మాత్రం ఎక్కువ నిద్రపట్టింది గాదు. పూర్తిగా విచారించాడు. ఇలాంటి సంఘటన ఇక ముందెప్పుడూ కోరి తీసుకురాగూడదనుకున్నాడు మనసులో. పైక్కూడా ఏదో అనునయంగా అన్నాడు సరస్వతితో. ఆమె చిన్నగా మందహాసం చేసి ఊర్కుంది.

తండ్రి అభిప్రాయాలలోని పొరపాట్లు ఆమెకిప్పుడిప్పుడె తెలిసివస్తున్నై. ఆయన అనుకున్న దాంట్లో విచిత్రం ఏమీ లేదు. పైగా తాము మంచి దంపతులే అయ్యారు. కాని 'ఆడబిడ్డ పోరు'ని గురించి ఎవ్వరూ ఆలోచించలేదు. ఏ మాత్రం ఆ మాట గుర్తుకు వచ్చినా; తన తండ్రి ఈ అభిప్రాయానికి దూరంగా వెళ్ళిపోయేవాడే! కాని అట్లా జరిగి ఉండలేదు. ఒక గొప్ప తప్పిదానికి ఫలితంగా సరస్వతి కట్టుబడి పోయింది. ఈ శారీరక పరిశ్రమకు పైగా ఈ స్త్రీలు, సరస్వతి తమకు చాకిరీ చేయటానికే ఈ ఇల్లు మెట్టినట్లుగా మాటాడసాగినారు.

"ఏరికోరి ఈ సంబంధం చేసుకున్నప్పుడు తప్పుతుందా మరీ? మా అయిదుగురి తర్వాత కోరికలు చిగురించగా పుట్టాడు ముకుందం. వాడి భార్యంటే మాకు మాత్రం ఇష్టంలేదా? దానింట ఉండటమే మాకు ఇంకా ఇష్టం".

కూతురు సుఖాన్ని అపేక్షించే తండ్రి ఏకైక పుత్రసంతానాన్ని కన్న వియ్యంకుడిని యేరుకుంటాడు. సాధ్యమయినంత వరకూ, ఆడబిడ్డలూ–ఆ తరువాత తోటి కోడళ్ళూ ఆపైన అత్తమామలూ లేకుండ చూచుకుంటాడు, తన కూతురుకు. కాని శాస్త్రిలోని అసాధారణత్వం ఇన్ని చిక్కులకూ దారితీసింది.

అక్కడికీ సరస్వతి అణకువతో అందరికీ చాకిరీచేసి పెట్టటం సహించ దగ్గదిగా కనిపించలేదు. వాళ్ళామె చింతల నెక్కువ చేయటానికి ప్రయత్నించారు. వాళ్ళ ప్రయత్నాలూ విఫలం అవటానికి వీల్లేక పోయింది. ముకుందరావు తీవ్రంగా బాధపడ్డాడు. విమోచన ఏమీలేదా అని కూడా ఆలోచించాడు. కాని కనిపించలేదు. ఆడబిడ్డలు పుట్టింటికి రాకమానరు. వాళ్ళతో పేచీలు పెట్టుకుంటే ప్రపంచానికి వెలిగావల్సి వస్తుంది. మంచితనానికి దూరం గావల్సి వస్తుంది. కాని అంతమాత్రం

చేత సరస్వతిని మానసికంగానూ, భౌతికంగానూ బాధించటానికి తనకేం హక్కు ఉన్నదీ? తనమీద ఆధారపడిన ప్రాణిసుఖాన్ని తను కోరుకోవాలి, వాంఛించాలి.

ఇంతలో మామగారినించి ఉత్తరం వచ్చింది; కూతుర్ని పుట్టింటికి పంపాల్సిందంటూ. ముకుందరావు సంతోషించాడు. మరునాడు సరస్వతి అన్న ఒకాయన వస్తాడనీ, అతనితో ఆ పిల్ల పుట్టింటికి వెళ్ళిపోతుందనీ తెలుసుకుని, ముకుందరావు చుట్టూ అక్కలు మూగారు. చర్చకొద్దిగా ముదురుపాకానే పడ్డది. “పుట్టింటికి వెళ్ళాలని ప్రతి ఆడదీ ఉబలాటపడుతుంది గదా! అదీ గాక, అది అక్కడ్నించి వచ్చి ఆరుమాసాలకు పైన అయింది. వాళ్ళు తీసుకు వెడతామన్నప్పుడు, పంపకుండా ఉండటం ఏం పెద్దమనిషి తరహా?” అన్నాడతను. “మరి మేం వచ్చి రెండు నెల్లన్నా కాలేదే! అపుడే మమ్మల్ని వెళ్ళిపొమ్మంటావా? మా పుట్టింట ఉండేందుకు మాకే హక్కు లేదన్నమాట!”

“లేదని ఎవరన్నారూ? మీరు ఇక్కడే వుండండి. ఇల్లు తాళంవేసి పోవటం లేదు గదా! మీ ఇష్టమైనన్నాళ్ళూ ఉండండి. నా అభ్యంతరం ఏనాడూ లేదు. పైగా నాకు హోటలు తిండి తప్పిపోతుంది!”

మొత్తానికి ఇతడి ధోరణి వాళ్ళకు నచ్చలేదు. అయితే దానికి ముకుందరావు ఏ సాయమూ చెయ్యలేడు కూడా! “సమస్త చాకిరీ చేసేందుకు ఇక్కడికి రావటం దేనికీ? మా ఇంటనే వుండి, మా మొగుళ్ళకు చేసి పెట్టుకోలేమా?” అన్నారు వాళ్ళు. ముకుందరావు ఈ స్త్రీ స్వభావమే అగమ్య గోచరంగా అయింది. తోటి స్త్రీ కష్టపడుతూంటే, చూస్తూ ఊర్కోగల ‘రాతిగుండె’ వీళ్ళకెక్కడ దొరికింది? దానికి తమకు హక్కు లున్నట్టు వాదిస్తారే; అసలు తను ఆదరించకపోతే మాత్రం అడిగేదెవరు? ఎవరి కోసమో తనెందుకు కష్టపడాలి? అవతలవాళ్ళకు తృప్తి లేనపుడు ప్రాణానికి హాయీ, తను ఎవరికోసం కష్టపడుతున్నాడో వాళ్ళకు తృప్తీ ఆనందమూ సుఖం కలిగినప్పుడు గదా? భార్య ఆనందించని పన్లు భర్త చేసేం? గుమాస్తా, యజమానికి రుచించని, ఘనకార్యం చేసేం? అక్కలు సంతోషం ఇవ్వనేరని పన్లు తమ్ముడెన్ని చేసేం? ఆడవాళ్ళకు ఈ రెండు రకాల ఇళ్ళూ భగవంతుడు ఎందుకు పెట్టాడో గాని, ఇది మగవాళ్లకు ప్రాణసంకటమే అవుతూన్నది... అనుకున్నాడు ముకుందం.

రైల్లో ఎక్కించిన తరువాత భార్యతో అన్నాడు : నువు వాళ్ళని గురించి మనసులో బాధపడకు. నువు తిరిగి వచ్చేలోపల వాళ్ళ సంగతేదో చూస్తాను?

మొదట్లో చూపినంత నిర్లక్ష్యాన్ని కనపర్చక పోవటం గమనించాడు. అవును మరి! ఎన్నాళ్ళని యంత్రంలా మొండిపడి పనిచెయ్యగలదు?... ముకుందరావు ఇంటికి

వెళ్ళాడు. రెండు రోజులన్నా పూర్తిగా గడవకముందే, అంతకుముందు నుంచి వున్న ముగ్గురు అక్కలూ వెళ్ళిపోయారు. వాళ్ళీ రెండు రోజులున్నూ ముకుందాన్నీ, సరస్వతినీ తెగ ఆడిపోశారు. తామంటే నిర్లక్ష్యం అన్నారు. శత్రువులను చూచినట్లు చూస్తున్నారు అన్నారు. పుట్టిల్లు తలిదండ్రులున్నన్నాళ్ళేనన్నారు. తమ్ముడుగా ముకుందంతో సంబంధం తెగతెంపులు చేసుకుని ఆ ఊరు వదిలి వెళ్ళిపోయారు. ఈ తెగతెంపుల వ్యవహార పర్యవసానం గురించి ముకుందరావు తీవ్రంగా ఏమీ ఆలోచించలేదు. ఆలోచించినా ఫలం ఉండి ఉండేది గాదు!

రైలు కదిలింతరువాత సరస్వతి అన్న చెల్లెల్ని ఆవిడ అత్తింట అనుభవిస్తున్న సుఖాలగురించి ప్రస్తావించాడు. అన్ని సంగతులూ తెలుసుకుని, "వాళ్ళను రావద్దని నువుగాని, అతనుగానీ ఎందుకు చెప్పరాదు?" అన్నాడు.

"బాగుంది రా అన్నయ్యా, ఆడబిడ్డల్ని రావద్దని కొంపేం నిలబెట్టుకోగలం? మనం అనేదేమిటి? వాళ్ళకూ హక్కులున్నై. అయినా వచ్చినందుగ్గాదుగాని, చేస్తున్న చాకిరీకి సంతోషించి, ఎత్తి పొడుపు మాటలనకుండా వుంటే బాగుండును వాళ్ళు"

కొద్దిగా – ఆగి, మళ్ళీ మొదటికొచ్చి "నన్ను రావద్దని అనరాదూ, మీ భార్యలకు శ్రమలేకుండా!" అన్నది.

"అయిదుగురం, నీకు లోటేమిటి? అయిదుగురి తరువాత గలిగిందానివి. నువ్వంటేమాకు ప్రేమానురాగాలు ఎట్లా తగ్గుతై" అన్నాడతను. "వాళ్ళయిదుగురి తరువాత పుట్టిన మగమనిషి! ఆయనంటే వాళ్ళకు ప్రాణం గావును!" అన్నది సరస్వతి పూర్వపు ధోరణిలోనే.

"అది మగవాళ్ళకుంటుంది గాని, ఆడవాళ్ళకు రాదు"... అతను లోతుగా ఆలోచించాడు. చాలా సేపటి వరకూ ఎవరూ మాట్లాడలేదు.

సరస్వతిని బాహ్య ప్రపంచం బాగా ఆకర్షించింది. పక్కనున్న అన్నగానీ, ఇంకా పెట్టెలో వాళ్ళుగానీ ఏం చేస్తున్నదీ గమనించకుండా బయటికి తలపెట్టి చూస్తున్నది. ఒక స్టేషనులో రైలాగింది. అకస్మాత్తుగా సరస్వతి అన్నవైపు తిరిగింది. అతను నిట్టూరుస్తూ "అవునమ్మా ఈ ఆడబిడ్డలు పుట్టింటికి రాక మానరు. అక్కడి వాళ్ళు చెయ్యి చేసుకోటానికి కూడా ప్రయత్నించరు. ప్రయత్నించగూడదు. ఎక్కువమంది ఆడబిడ్డలున్న ఇంటికి కోడలుగా ఇవ్వటం నాన్నదీ, అమ్మదే తప్పు! వాళ్లావిషయమే ఆలోచించారు గాదు. మతిహీనులు!" అన్నాడు.

"అదేంమాట అన్నయ్యా? అయినా నువ్వింకా ఈ విషయంమే ఆలోచిస్తున్నావా?" అంది సరస్వతి... ముకుందరావు తన భర్త కాకపోతే ఎట్లాగు? అని ఆలోచిస్తూ, ఆడబిడ్డల సంగతే మర్చిపోయి.

"నాన్న నియమం సగం మంచిదయింది, సగం చెడ్డదయిందీ. ముకుందరావు నీకు సరిగ్గా తగినవాడు. అయిదుగురు ఆడపిల్లల తరువాతగాని "తను పుట్టక పోవటం మన దురదృష్టం. అయినా అట్లాంటి వాళ్ళు అక్కలుగానీ, చెల్లెళ్ళుగానీ లేకుండా పుట్టకపోవటం మన దురదృష్టం! అసంభవమూ గాదు. ఇంతకూ నాన్నకూ, అమ్మకూ ఆ ఆలోచన కలక్కపోవటం పాతకం. ఆడదిగదా, అమ్మయినా ఆ మాత్రం ఊహించగూడదూ? కేవలం బళ్లో చెప్పే లెక్కల్లాగా వర్తించటం, అనుభవపూర్వకంగా జీవితంలో యెట్లా రంజిల్లుతుంది?" అన్నాడు.

"నాన్న మటుకేం చేస్తాడు? విధి అట్లా తోసుకొచ్చింది"

ఈ విధి అన్నదాన్లో అతనికి నమ్మకం లేదు. మనుషులు అనేక పన్లు చేస్తారు. సుఖాన్ని కాంక్షించీ, కాంక్షించకా! అన్నీ అనుకూలించవు. కాని యెదురు తిరుగుతూంటై. ఈ యెదురు తిరిగినవాటి ప్రభావం వల్ల దుఃఖభాజనులైన వాళ్ళు విధినీ, కర్మనీ ఆపాదించు కుంటూంటారు. అంతేగాని, నిజమైన జీవితంలో అట్టిదాని కేరకంగానూ తావులేదు. కాకపోతే ఆడపిల్లల్లేని ఇంటికి సరస్వతిని ఇవ్వటానికి ఎవరు అడ్డుపెట్టారు? ఆలోచన కలక్కపోవటం యెవరితప్పో యెట్లా అవుతుంది?

ఒకరు చేసిన తప్పు, ఇతరులమీద గూడ ఎట్లా ప్రభావం చూపిస్తుందో ఊహించుకుంటున్నాడతను. ఇవన్నీ ఏనాడో ఊహించి పెట్టేసింది సరస్వతి. "ఈ విషయమై ఇప్పుడు చేయగలిగిందేమీ లేదు. జరిగిపోయిందాని గతిని మార్చేందుకు మన చేతుల్లో ఏమీ లేదు. కాక, సంసారాన్ని పాడుచేసుకోం గదా ఈ కారణంగా!" అనుకుంది. సరిగ్గా ఇదే నిర్ణయానికి వచ్చేశాడు ఆమె అన్న. వీళ్ళిద్దరే గాదు, మరెవరు ఈ విషయమై శాంతంగా ఆలోచించినా అంతిమనిర్ణయం ఇదే! మరోమార్గం లేదు. అట్లాగని మాట్లాడకుండా ఉండగల తాహతు మనుషులకు లేదు. ఈ ఓర్పు, తాలిమీ పాపమా సమాజం కోల్పోయింది. ఏ మాత్రమో వున్నా అది కాలగమనంలో సమసిపోయి ఉంటుంది, నిస్సందేహంగా?

ఈ ట్రిప్పులో సరస్వతి పుట్టింట నెలరోజులు మాత్రమే వున్నది. నెలాఖరున ముకుందరావు వచ్చి, తీసుకువెళ్ళాడు. శాస్త్రిగారూ, ఈశ్వరమ్మా, అయిదుగురు

అన్నలూ, వదినలూ, అంతా సరస్వతి దురవస్థకు బాధపడ్డారు. శాస్త్రిగారు కూతురుకు ద్రోహం చేశానని ఒప్పుకున్నారు (ఒప్పుకోకపోయినా అది నగ్నసత్యం, అయినా ఒప్పుకోక పోవటం ఆయన స్వభావం గాదు). తానుయేర్పరుచుకున్న నియమానికి – ఆలోచించగా ఆయనకిపుడు ప్రయోజనమూ కనిపించలేదు. ఆ క్షణంలోనైనా ఏదో ప్రయోజనాన్ని ఆశించి ఆ మాట అనలేదు. కేవలము ఉబలాటం. అయిదుగురు మగపిల్లల వెనక పుట్టిందనే ఉత్సాహం కొద్దీ అయిదుగురు ఆడపిల్లల వెనుక పుట్టిన మగవాడికి ఇవ్వాలని ఆయనకు కోరిక కలిగింది. దాని ముందు వెనకలు ఆలోచించటానికి ఆయనకు తీరికలేక పోయింది. ఈ కోరిక అప్పట్లో తీరకపోయి ఉన్నట్లయితే సరస్వతి జీవితానికి ఏదో లోటుపాటు జరిగివుండేవని చెప్పలేము గాని శాస్త్రిగారు జీవిత పర్యంతమూ అధికంగా వాపోయేవాడు, తన అసమర్ధతకూ, దైవ ప్రాతికూల్యానికీ. అప్పుడనుకూలించిన దైవం ఇప్పుడనుకూలించడు.

"అంతమందికీ వండటం వార్చటం అదీ సాధారణంగానా? రెండుపూట్లా కాఫీలు, ఫలహారాలు... ఎంత ధనవంతులయితేనేం? ఇంటిపన్లు చేసుకోవటం యెంత చేతనయితేనేం? మాటలా... ఒక్క తలమీదుగా నిర్వాకం అవాలంటేనూ? పిల్ల మరీ నలిగిపోయింది. ఒంటి జాగ్రతకూడా ఎప్పటి కపుడు చూచుకుంటూండాలి! ఈ కాలప్పిల్లలు మరీను. మేమంటే బండశరీరాలవాళ్ళం ఎంత మొండిచాకిరీ అయినా చేయగలం. నాగరికత హెచ్చిందీ, సుకుమారాలు వచ్చాయి, పనీపాటలు చేసుకునే శక్తులు నశించిపోయాయి. పిల్ల ఇదే పరిస్థితిలో ఇంకా కొన్నాళ్ళు వుంటే చాలా ప్రమాదకరమైన పరిణామమే వస్తుంది!" అన్నది ఈశ్వరమ్మ ముకుందరావు ఎదుటనే, ఏదో ప్రస్తావన తెచ్చి. అతను తలవంచుకున్నాడు. ఈ సమస్యకేమీ సరస్వతిని బాధించినట్లు కనిపించదు; ఒక్క ఆడబిడ్డల సూటిపోటు మాటలు తప్ప!

'నాకూ అయిదుగురు కోడళ్ళున్నారు. నాకు తెలుసు– వాళ్లకు తెలుసు నేను వాళ్ళనెంత ఆప్యాయంగా చూచేదీ' అన్నాడు శాస్త్రి. సరస్వతి అన్నలకు బావగారితో ఏం చెప్పాల్సిందీ తోచలేదు. ఇక ఆడబిడ్డల్ని రావద్దనీ, చెల్లెల్ని కష్టపెట్టవద్దనీ అనాలి. తమ ప్రమేయం లేకుండా జరిగేదేదో జరిగేపోతుంది. తమ హెచ్చరికవల్ల యేమీ మార్పు కనిపించదు. సరస్వతి వెళ్ళిపోయింది. శాస్త్రి దినచర్యలో కొత్త దిగులు ఏర్పడ్డది. కూతురిని సుఖాలకు దూరం చేసిన దుఃఖం ఆయన్ను బాధపెడుతూన్నది. ఈశ్వరమ్మ కడసారి కూతురు కష్టాలు వల్లె వేసుకుంటూ కాలం గడుపుతున్నది.

ముకుందరావుతో ప్రత్యక్షంగా ముగ్గురు అక్కలు కయ్యమాడారు. ముకుందరావు మళ్ళీ తన స్వగృహం సరస్వతితో చేరుకునే సరికి, ఆ ఇంటి రెండో ఆడపడుచు (ఫై

ముగ్గుర్లో ఈమె లేదు) వచ్చి చేరింది. ముకుందరావు ఈమె వల్ల ఎక్కువ కష్టం ఉంటుందనుకోలేదు. అతని ఊహలోనూ ఎక్కువ పొరపాటు లేదు. సరస్వతికి ఇదివరకంత కష్టం అనిపించటంలేదు, పైనవున్నది ఒక్కతే అవటంచేత. రెండో అక్కగారికి అత్తమామలు ఇద్దరూ బతికి వున్నారు. పైగా ఒక విధవాడబడుచు ఉన్నది. మగడు గొప్ప ప్రయోజకుడు కాడు. పిత్రార్జితం చాలా వున్నది. ఆ అక్క చెల్లెళ్ళందర్లోకి ఈమె కొద్దిగా సుస్వభావి. ఆడకష్టాలూ, ఇరుపు పొరుపులూ ఎరిగినది. స్వజాతి జనం అంటే అభిమానం, అనురాగం. సుతి మెత్తని మనసు. ఒకర్ని దెప్పటం ఈమె అసలెరుగదు. ఈమంచి తనాన్ని కొందరు అతి తెలివిగలవాళ్ళు అమాయకత్వంగా అపార్థం చేసుకుంటారు.

ఈమెతో ముకుందరావు తన కష్టసుఖాలు చెప్పుకున్నాడు. అన్నీ ఓపిగ్గా విన్న మీదట "వాళ్ళకెపుడూ ఉన్న తెగులేలే అది. సొంత చెల్లెల్ని, అక్కని నామీదే లేనిది, మరదలు మీద ఎందుకుంటుందీ? వాళ్ళ స్వభావాలకు అనుకుంటాం మరేం లేదుగాని, ఛీ, ఇలాంటి మనుషులతో నాకు తలనొప్పి. చిన్నపిల్లగదా, దానిచేత చేయించుకోట మేమిటి బడుద్ధాయి వేషాలు గాకపోతే?..." అన్నది.

"దానికంతా ఏమిటి వదినా, ప్రేమలు వుంటై - లేకపోవు - ఆ సంగతి కాదిప్పుడు. పుట్టిల్లు సుఖాలు వద్దన్నామా? చేసినంతవరకూ చేయించుకుని ఎంతకూ తృప్తి అనేది లేకుండా తీరా నేను వెళ్ళింతరువాత ఆయన్తో పోట్లాడి వెళ్ళిపోతే ఏమనుకోము? నెలకన్నా ఎక్కువ ఉండలేదే నేనూ. ఈ నెలరోజులూ తామూ వుండి... అయ్యోరామ! నిష్ఠూరాలో మళ్ళీ, తలంత బరువు...!" అన్నది సరస్వతి.

"ప్రపంచంలో ఎవరూ శాశ్వతంగాదు. ప్రతి వారూ ఎపుడో అప్పుడు ఈ లోకాన్ని విడిచి, పరలోకానికి పోవలసినవారే. కాకపోతే, మిగిలేవి పేరుప్రతిష్ఠలు. అవి చాలు మనుషులకు, కాస్తదాన్లో, ఏవో తప్పులేరి మమ్మల్ని రాచిరంపాన బెట్టినందు వల్ల వాళ్ళకూ లాభం ఉంటుందనుకోను?..." అన్నాడు ముకుందరావు.

"వాళ్ళేవస్తారు, ఎవరికోసం? ఎవరి పుట్టిల్లనీ?" అన్నది అక్కగారు.

"వస్తారా ఏమీ లేదు. రాకపోతారుకానీ, ఎవరిగొప్పలు వారికే. ఒకళ్ళమీద ఒకళ్ళు ఆధారపడి యెవరూ లేరు" అన్నాడు ముకుందం.

అయితే అతి స్వల్ప కాలంలోనే ఆ ఆడబిడ్డల రాక సంభవించింది. ఇందులో ముకుందరావు ప్రమేయం ఏమీ లేదు. ఇంత మాత్రం చేత పరిస్థితులు చక్కబడ్డా

యంటానికి లేదు. సరస్వతి "మీరెందుకింత తాపత్రయపడతారు? వాళ్ళను రానీండి, పోనీండి, నా చేతనైనంత వరకూ చేసిపంపుతాను. ఈ ఒక్కదాన్లో మన మంచి చెడ్డ లేం బయటపడవు గదా?" అన్నది భర్తతో.

"అదేమన్నమాట? మీ తండ్రికి అయిదుగురు మగపిల్లల తరువాత దానివి నీవు. మా తండ్రికి అయిదుగురు ఆడపిల్లల తరువాత వాడిన్నేను. ఇద్దరికీ జంట కలిసింది. ఈ మధ్య వాళ్ళ జోక్యం మనకెందుకు?" అన్నాడతను.

"పై అయిదుగురూ లేందే మన మెవరం?" అన్నది అస్పష్టంగా సరస్వతి...

"భార్యాభర్తలం!" అన్నాడు ముకుందరావు జవాబుగా.

ఆపైన ఏమనటానికీ సరస్వతి మనసుకు తోచింది గాదు.

❖